సాక్షి
జనగామ
బుధవారం | 12 | ఏప్రిల్ | 2023



లాభదాయకం గొర్రెల పెంపకం

గొర్రెల పెంపకంతో రైతులు ఆర్థికంగా ఎదగ వచ్చని కేవీకే శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గొర్రెల ఎంపిక, వసతి, పునరుత్పత్తి వంటి జాగ్రత్తలు వివరించారు. - 8లో▸



నేటి నుంచి దూరవిద్య పీజీ పరీక్షలు

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నేటి నుంచి (12వ తేదీ) పీజీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$38^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. ఎండ కారణంగా రాత్రిళ్లు ఉక్కపోత ఉండనుంది.



స్కానింగ్ కష్టాలు

ఎంసీహెచ్‌కు రికార్డు స్థాయిలో గర్భిణుల రాక

- ఒకేఒక్క రేడియాలజిస్ట్.. పెరుగుతున్న భారం
- స్కానింగ్ సేవలకు గైనిక్ వైద్యులు దూరం
- టిఫా స్కానింగ్ సేవల్లో ఎంసీహెచ్‌కు రాష్ట్రంలో 3వ స్థానం

జనగామ: గర్భిణులకు మొదటి నెల నుంచి పండంటి బిడ్డకు జన్మనిచ్చే వరకు కష్టాలు తప్పడం లేవు. వైద్య పరీక్షలకు ఆస్పత్రికి వచ్చి.. గంటల తరబడి నిరీక్షించే గర్భిణులు .. స్కానింగ్ కోసం అప్ అండ్ డౌన్ చేస్తున్నారు. ఎంసీహెచ్‌కు డెలివరీల కోసం వచ్చే వారి సంఖ్య రికార్డు స్థాయిలో క్రమక్రమంగా పెరుగుతోంది. గర్భిణుల సంఖ్యకు తగ్గట్టుగా రేడియాలజిస్టుల నియామకం లేకపోవడంతో సమస్య జఠిలంగా మారిపోతుంది. గైనిక్ డాక్టర్లు సైతం స్కానింగ్ చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆదేశాలు ఇచ్చినా ఇక్కడ మాత్రం అమలు కావడం లేదు. ప్రస్తుతం ఉన్న ఒకే ఒక్క రేడియాలజిస్ట్‌పై రెట్టింపు భారం పడుతోంది. అయినప్పటికీ టిఫా స్కానింగ్ సేవల్లో జనగామ ఎంసీహెచ్ రాష్ట్రంలో 3వ స్థానంలో నిలిచి మరో రికార్డును సొంతం చేసుకుంది.

జనగామ చంపక్‌హిల్స్ మాతా, శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్) ప్రసూతి కాన్పుల్లో రాష్ట్రంలో ఉత్తమ సేవలు అందించే ఆస్పత్రుల్లో ఒక్కటిగా నిలుస్తుంది. కానీ స్కానింగ్ సేవలకు వచ్చే సరికి మాత్రం కష్టాలు తప్పడం లేదు. కేసీఆర్ కిట్టు, నగదు పారితోషికంతో పాటు కార్పొరేట్ వైద్య సేవలతో.. డెలివరీలకు మాత్ర జిల్లాతో పాటు సిద్దిపేట, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి ప్రాంతాల నుంచి ఎంసీహెచ్‌కు క్యూ కడుతున్నారు. దీంతో సేవల పరంగా కొంతమేర ఇబ్బంది తప్పడం లేదు. దీనికి తోడు రేడియాలజిస్టుల కొరత వేధిస్తోంది. ప్రస్తుతం నలుగురు రేడియాలజిస్టులు పని చేయాల్సిన చోట ఒక్కరితోనే నెట్టుకు వస్తున్నారు. దీంతో నెలవారి (యూజీసీ)తో పాటు 5 మాసాల(20 వారాలు) సమయంలో తీసే టిఫా స్కా నింగ్ కోసం సీరియల్ నంబరింగ్ సిస్టం అమలు చేస్తున్నారు. రోజుకు 30 నుంచి 40 మందికి పైగా స్కానింగ్ తీస్తుండడంతో మిగతా గర్భిణులు రెండు లేదా మూడు రోజుల పాటు ఆస్పత్రికి అప్ అండ్ డౌన్ చేయాల్సి వస్తుంది.

మార్చిలో 6,851 ఓపీ

ఎంసీహెచ్‌కు రికార్డు స్థాయిలో ఓపీ పెరుగుతోంది. గతనెల మార్చి మాసంలో 6,851 ఓపీ నమోదు కాగా ఇందులో ఒక్క గైనిక్ విభాగంలోనే 509 మంది పేర్లు రికార్డు చేశారు. నెలవారి స్కానింగ్ 482, టిఫా స్కానింగ్ 150 మందికి తీయగా.. 344 డెలివరీలు చేసినట్లు వైద్యులు వెల్లడించారు. యావరేజ్‌గా ప్రతిరోజూ 300 వరకు ఓపీ నమోదవుతోంది. ఈ నెలలో ఇప్పటి వరకు 111 డెలివరీలు చేశారు.

టిఫా స్కానింగ్‌లో స్టేట్ 3వ ర్యాంకు

టిఫా స్కానింగ్ సేవల్లో జనగామ ఎంసీహెచ్ రాష్ట్రంలో 3వ స్థానంలో నిలిచింది. జనవరిలో 47, ఫిబ్రవరిలో 58, మార్చిలో 158 స్కానింగ్‌తో ఉత్తమంగా నిలిచినా.. ఎంసీహెచ్‌కు డెలివరీ కోసం వచ్చే సంఖ్య పెరుగుతున్నా గర్భిణులకు తగ్గట్టుగా పూర్తి స్థాయిలో అందడం లేదు.



ఆస్పత్రిలో స్కానింగ్ కోసం క్యూలో గర్భిణులు



ఎంసీహెచ్ ఆస్పత్రి

మార్చిలో ఎంసీహెచ్ సేవలు	
బెడ్లు:	192
మార్చి ఓపీ:	6,851
ఇన్ పేషెంట్లు:	981
గైనిక్ ఓపీ:	3,754
పిల్లల ఓపీ:	3,097
గైనిక్ ఇన్‌పేషెంట్లు:	509
డెలివరీలు:	344
నెలవారి స్కానింగ్:	482
టిఫా స్కానింగ్:	150
గైనిక్ వైద్యులు:	9
చిన్న పిల్లల వైద్యులు:	6
అనస్థీషియా వైద్యులు:	4

మంత్రి ఆదేశాలు ఎక్కడ?

గర్భిణులకు రేడియాలజిస్టులతో పాటు గైనిక్ డాక్టర్లు సైతం స్కానింగ్ చేయాలని మంత్రి హరీశ్‌రావు జారీ చేసినా ఆదేశాలు ఇక్కడ అమలు కావడం లేదు. రేడియాలజిస్టుకు తోడు గైనిక్ డాక్టర్లు సైతం ముందుకు వస్తే గర్భిణులకు అవస్థలు ఉండవు. అంతే కాకుండా ప్రైవేట్‌కు సైతం వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఎంసీహెచ్‌లో స్కానింగ్ విషయంలో జాప్యం జరుగుతుండడంతో.. చాలా మంది ప్రైవేట్ సెంటర్లకు వెళ్తున్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం..



స్కానింగ్‌కు గర్భిణులకు ఇబ్బందులు రాకుండా చూస్తున్నాం. ఒక్క రేడియాలజిస్టు రోజుకు 50 వరకు తీస్తున్నాడు. గైనిక్ వైద్యులు సైతం స్కానింగ్ తీయాలి. స్కానింగ్ విషయంలో రాష్ట్రంలోనే జనగామ ఎంసీహెచ్ 3వ స్థానంలో నిలవడం గర్వకారణం.

- సుగుణాకర్‌రాజు, మెడికల్ సూపరింటెండెంట్, ఎంసీహెచ్

రేపు రమ్మన్నారు..



ప్రసూతికి కొద్దిరోజులే సమయం ఉంది. ప్రస్తుతం 9 నెలలు. చివరి స్కానింగ్ కోసం ఎంసీహెచ్‌కు వస్తే..తన లైన్ వచ్చే సరికి రేపురమ్మన్నారు. మండుతున్న ఎండలతో చాలా ఇబ్బందిగా ఉంది.

- గంగధారి రజిత, గర్భిణి, రఘునాథపల్లి

రెండు రోజులుగా..



నెలవారి (యూజీసీ) స్కానింగ్‌కు రెండు రోజులుగా తిరుగుతున్నా. ఉదయం 10 గంటలకు ఎంసీహెచ్‌కు వస్తే.. తన క్యూ లైన్ వచ్చే సరికి మాధ్యాహ్నం 12.35 గంటలు అయింది. అప్పటికే స్కానింగ్ టైం పూర్తయిందని ఇంటికి పంపించారు. మూడో రోజు మళ్లీ రమ్మన్నారు.

- బైరి స్వాతి, గర్భిణి, కుందారం

సింపుల్‌గా చెప్పేస్తున్నారు..



9 నెలల గర్భంతో స్కానింగ్ కోసం ఎంసీహెచ్‌కు వస్తే... 50 మంది సంఖ్య పూర్తయింది... మీరంతా రేపు రండి అంటూ సింపుల్‌గా చెప్పి పంపించేస్తున్నారు. 15 కిలోమీటర్ల దూరం నుంచి ఎర్రని ఎండలో వస్తే.. తమ ఇబ్బందులను కనీసం పట్టించుకోవడం లేదు.

- పి.అశ్విని, గర్భిణి, కుందారం

నిజాం తరహాలో పాలన సాగిస్తున్న కేసీఆర్



బీజేపీలో చేరిన పలు పార్టీల నాయకులు

దేవరుప్పుల: నిజాం తరహాలో పాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజలు రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రాం మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఈ నెల 15వ తేదీన వరంగల్‌లో తలపెట్టిన నిరుద్యోగ మార్చ్‌పై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ పునర్నిర్మాణం పేరిట బీఆర్ఎస్ రాష్ట్రాన్ని దోచుకుంటుందన్నారు. నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటమాడుతున్న కేసీఆర్ ప్రభుత్వం ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందన్నారు. మున్‌పహాడ్‌కు చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు మొలుగూరి యాదయ్య, చింతకింది కొండయ్య, రాకేష్, వేల్పుల ఐలయ్య, సంతోష్, వర్రె కల్యాణ్, కన్నెబోయిన ఐలయ్య, సాయికుమార్, చీకటి ఎల్లేష్, శ్రీకాంత్, వేల్పుల సంతోష్ తదితరులు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పాలకుర్తి కో కన్వీనర్ కోటి, మండల పార్టీ అధ్యక్షుడు భాగాల నవీన్ రెడ్డి, జిల్లా అధికారి ప్రతినిధి చింత సృజన్, తిరుపతి నాయక్ పాల్గొన్నారు.

ముగిసిన 'పది' పరీక్షలు

జనగామ రూరల్: పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిసినట్లు డీఈఓ కె.రాము తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇందుకు సహకరించిన కలెక్టర్, శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, పోలీసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 42 పరీక్ష కేంద్రాల్లో 6,748 మంది విద్యార్థులకు గాను 6,741 మంది పరీక్షలకు హాజరు కాగా ఏడుగురు గైర్హాజర్ అయ్యారని తెలిపారు. ప్రైవేట్ విద్యార్థులు ఆరుగురికి గాను ఐదుగురు హాజరు కాగా ఒకరు గైర్హాజర్ అయ్యారు. పలు పాఠశాలలను కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఏసీజీ అర్జున్‌కుమార్, డీఈఓ రాము సందర్శించారు.

న్యూస్‌రీల్

టీ సేవ్ లోగో ఆవిష్కరణ



జనగామ రూరల్: వైఎస్సార్ టీపీ ఆధ్వర్యంలో టీ సేవ్ కార్యక్రమంలో భాగంగా టీ సేవ్ (తెలంగాణ స్టూడెంట్స్ యాక్షన్ ఫర్ వెకెన్సీస్ అండ్ ఎంప్లాయిమెంట్) లోగోను మంగళవారం జిల్లా అధ్యక్షుడు గొరబోయిన సమ్మయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తూ వారి జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. సమస్యల పరిష్కారానికి అన్ని పార్టీలను కలుపుకుని ఈ నెల 17వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద తలపెట్టిన 48 గంటల నిరాహార దీక్ష కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు మానేగళ్ల మంజుల, ఐటీ వింగ్ అధ్యక్షుడు మేడ ప్రశాంత్, నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, వంశీ, శ్రీధర్, శ్రీకాంత్, శివ, మధు, తదితరులు పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో రజక మహాసభలు



రఘునాథపల్లి: జనగామ జిల్లా కేంద్రంలో ఈ నెల 29, 30వ తేదీల్లో నిర్వహించే రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర మూడో మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు మైలారపు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన సంఘం నాయకులతో కలిసి పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రఘునాథపల్లిలో ఎంపీటీసీ పేర్ని ఉషారవి, ఖిలాషాపూర్‌లో సర్పంచ్ ముప్పిడి శ్రీధర్‌లతో మహాసభ కరపత్రాలను ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు ఎదునూరి గట్టేశం , రాజయ్య, సారయ్య, యాదగిరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొత్త బస్టాండ్‌కు కదలిక

సాక్షి, వరంగల్: వరంగల్ అధునాతన బస్టాండ్ నిర్మాణానికి ఎట్టకేలకు అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగానే ప్రస్తుతం ఉన్న 25 ఏళ్ల క్రితం ఆర్‌సీసీ స్ట్రక్చర్‌తో నిర్మించిన బస్టాండ్‌ను కూల్చేందుకు కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) టెండర్‌ను ఆహ్వానించింది. దాదాపు ఏడాది నుంచి అధునాతన హంగులతో వరంగల్ కొత్త బస్టాండ్ నిర్మాణం ఉంటుందని చర్చ జరుగుతున్నా.. ప్రస్తుతం కార్యాచరణ దిశగా అడుగులు పడుతున్నాయి. వరంగల్ బస్టాండ్‌లోని భవనాలు నేలమట్టం చేసి నిర్మాణానికి అనువుగా క్లియర్ చేసేందుకు ఆసక్తి ఉన్న సంస్థలు ముందుకు రావాలని 'కుడా'అధికారులు ఇచ్చిన టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈనెల 14 వరకు బిడ్‌లు దాఖలు చేయాలని కోరారు.

పదిహేను రోజుల్లో పూర్తి చేయాలి

దాదాపు 25 ఏళ్ల క్రితం ఆర్‌సీసీ ఫ్రేమ్‌డ్ స్ట్రక్చర్‌తో వరంగల్ బస్టాండ్‌ను నిర్మించారు. లోకల్ బస్టాండ్ మూడు అంతస్తులు (జీప్లస్–2) ఉంది. గ్రౌండ్ ఫ్లోర్ ఎత్తు 18 ఫీట్లు, ఇతర ఫ్లోర్‌ల ఎత్తు 12 ఫీట్లు, మొత్తం శ్లాబ్ ఏరియా 1958 చదరపు మీటర్లు ఉంది. అలాగే.. జిల్లా బస్‌స్టేషన్ రెండు ఫ్లోర్‌లు (జీప్లస్–1)గా ఉంది. గ్రౌండ్ ఫ్లోర్ ఎత్తు 18 ఫీట్లు, తొలి అంతస్తు ఎత్తు 12 ఫీట్లు ఉంది.

మోడ్రన్ బస్‌స్టేషన్ నిర్మాణం ఇలా..

బెంగుళూరులోని ఇంటర్ సిటీ బస్ టెర్మినల్ తరహాలోనే వరంగల్ మోడ్రన్ బస్‌స్టేషన్‌ను నిర్మించనున్నారు. అన్ని జిల్లాల, రాష్ట్రాల బస్సులతో పాటు సిటీ బస్సులు ప్రయాణికులు ఎక్కించుకునేలా గ్రౌండ్ ఫ్లోర్‌లో 32 ప్లాట్‌ఫామ్స్ నిర్మించనున్నారు. మరో ఐదు అంతస్తుల్లో వ్యాపార, వినోద వసతులు ఉండేలా కాంప్లెక్స్‌లు అందుబాటులోకి తేనున్నారు. సెల్లార్‌లో పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. అలాగే.. రైల్వేస్టేషన్, నియోకు అనుసంధానంగా వరంగల్ బస్టాండ్ ఉండేలా.. అండర్ వాక్ లేదంటే స్కైవాక్ నిర్మించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. నెలన్నర క్రితం రూ.75 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం అధికారిక అనుమతులు ఇచ్చింది.

పూలే సేవలు మరువలేనివి..



మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ రూరల్: ప్రజలందరూ సమానంగా జీవించాలని కృషి చేసిన గొప్ప మానవతా మూర్తి మహాత్మాజ్యోతిరావు పూలే సేవలు మరువలేనివని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. పూలే 197వ జయంతిని పట్టణంలోని సూర్యాపేట రోడ్డులోని కెమిస్ట్రీ భవన్‌లో వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి కలెక్టర్ శివలింగయ్య పాల్గొని మాట్లాడారు. సమాజ అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు పూలే అన్నారు. స్త్రీ జనోద్ధరణకు పాటుపడడంతో పాటు అనేక చట్టాలు తీసుకొచ్చేందుకు కృషి చేశారని తెలిపారు. స్త్రీల కోసం ప్రత్యేకంగా శ్రీ విద్యా నిలయాలను ఏర్పాటు చేశారని వివరించారు. జిల్లా కేంద్రంలో పూలే విగ్రహం ఏర్పాటుకు తమ వంతుగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోకల జమున, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, కౌన్సిలర్ అనిత, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'పది' పరీక్ష కేంద్రాల పరిశీలన

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను కలెక్టర్ శివలింగయ్య మంగళవారం తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని జెడ్పీ సెకండరీ పాఠశాల, ఆదర్శ పాఠశాలలో చివరి రోజు జరిగిన పరీక్షలను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు పదో తరగతి అయిపోగానే ప్రణాళికతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఉన్నత చదువులను చదివి ఉన్న ఊరు, కన్న తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని తెలిపారు. పరీక్షల నిర్వహణను ఇన్విజిలేటర్లు పకడ్బందీగా నిర్వహిస్తూ విద్యార్థులకు అన్ని వసతులు కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాము, మండల విద్యాధికారి భగవాన్‌దాస్, ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.

సోలార్ ఆన్‌గ్రిడ్ సిస్టమ్ ఏర్పాటు



పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో మహేందర్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని శివునిపల్లి జెడ్పీఎస్ఎస్‌లో మంగళవారం సోలార్ ఆన్‌గ్రిడ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీఎస్ఆర్ఈడీసీఓ(తెలంగాణ స్టేట్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) జిల్లా మేనేజర్ జి.మహేందర్ బృందం పాఠశాలను సందర్శించింది. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,521 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీ పాఠశాలకు 2 కిలోవాట్స్ సోలార్ ఆన్‌గ్రిడ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు గాను మొత్తం రూ.32 కోట్లు వెచ్చించారని, పైలట్ ప్రాజెక్టు కింద మొదటగా 80 పాఠశాలల్లో 2 కిలో వాట్ల సోలార్ ఆన్ గ్రిడ్ సిస్టమ్‌ను అమర్చినట్లు తెలిపారు. ఒక్కొక్క సిస్టమ్‌కు రూ.1,59,600 వెచ్చిస్తున్నారని వివరించారు. ఇందులో భాగంగా శివునిపల్లి జెడ్పీఎస్ఎస్‌లో ఏర్పాటు చేశామన్నారు. ఈ సోలార్ ఆన్‌గ్రిడ్ సిస్టమ్‌తో రోజుకు 8 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని తెలిపారు. దీంతో ఒక్కొక్క పాఠశాలకు దాదాపు రూ.2వేల విద్యుత్ భారం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.ప్రవీన్‌కుమార్, ఉపాధ్యాయులు శ్రీనాథ్, ఫకీర్‌దాస్, శర్మ, రాధాకృష్ణ, కృష్ణవేణి, వసంతకుమారి, నళినీబాయి, స్వర్ణలత, సునీత, ముంతాజ్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయాలి



గంగాపూర్‌లో పనులను పరిశీలిస్తున్న డీఈ శ్రీదేవి

బచ్చన్నపేట: గ్రామాల్లో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని జాతీయ గ్రామీణాభివృద్ధి శాఖ డీఈ శ్రీదేవి అన్నారు. మండల పరిధిలోని గంగాపూర్‌లో ఆమె మంగళవారం పర్యటించి పల్లె ప్రగతి పనులు, వన నర్సరీ, డంపింగ్ యార్డు, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పలుచోట్ల పల్లె ప్రగతి పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. వాటిని పూర్తి చేసే బాధ్యత అధికారులపైనే ఉందని తెలిపారు. సకాలంలో అభివృద్ధి పనులు చేయకుంటే చర్యలు తప్పవన్నారు. నర్సరీల్లో మొక్కలను కాపాడి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుశీల, కార్యదర్శి రాజశేఖర్, సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధితోనే పురోగతి

- రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి దయాకర్‌రావు
- 200 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ



కుట్టు శిక్షణ పొందిన మహిళలతో మంత్రి దయాకర్‌రావు, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి

పాలకుర్తి టౌన్: మహిళల ఆర్థికాభివృద్ధితోనే కుటుంబం.. దేశం పురోగతి సాధిస్తుందని రాష్ట్ర పంచాతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రాష్ట్రంలోనే మొదటి సారిగా పాలకుర్తి నియోజవర్గంలో పైలట్ ప్రాజెక్టు ప్రారంభించి ఉచిత కుట్టు శిక్షణ పొందిన 200 మంది మహిళా లబ్ధిదారులకు మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో కుట్ట మిషన్లు, ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, స్త్రీ నిధి ఆధ్వర్యంలో డీఆర్‌డీఓ రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. మహిళల సామాజిక, ఆర్థిక పరిస్థితులు బాగా తెలుసునని అందుకే కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్‌ను ఒప్పించి ఒక్క పాలకుర్తి నియోజకవర్గంలో మాత్రమే ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐకేపీ ద్వారా రూ.5.10కోట్లతో పాలకుర్తిలో ప్రయోగాత్మకంగా చేపట్టిన ప్రాజెక్టు ద్వారా 10 వేల మందికి ఉచిత కుట్టు శిక్షణ ఇవ్వాలని లక్ష్యం పెట్టుకుని మొదటి విడతలో 3వేల మందికి శిక్షణ ఇచ్చామని తెలిపారు. పదో తరగతి చదివిన వారు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు రవాణా సౌకర్యం కల్పించి జూలైలో వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో ఉద్యోగాలు ఇప్పిస్తామని వివరించారు. ఉద్యోగం చేయడం వీలుగాని మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు, ఏపీడీ నూరొద్దీన్, ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు కో ఆర్డినేటర్ కల్పన, ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మహిళా సమాఖ్య కార్యదర్శి గిరగాని సుధ, ఐకేపీ డీపీఎంలు, ఏపీఎంలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సంఘ సేవకుడు పూలే



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తి టౌన్: గొప్ప సంఘసేవకుడు మహాత్మాజ్యోతిరావు పూలే అని రాష్ట్ర మంత్రి దయాకర్ రావు అన్నారు. మండల కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూలే గొప్ప విద్యావేత్త, సామాజిక తత్వవేత్త అన్నారు. ఆయన ఆలోచన విధానాల స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. గురుకుల విద్యా వ్యవస్థల్లో సాధిస్తున్న ఫలితాలు పూలే అందించిన స్ఫూరి ఫలాలే అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గం రద్దు చేయాలని ఫిర్యాదు

రఘునాథపల్లి: మండల పరిధిలోని కంచనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అనేక అక్రమాలు జరిగిన నేపథ్యంలో పాలకవర్గాన్ని రద్దు చేయాలని మంగళవారం పలువురు సభ్యులు తెలంగాణ సహకార సంఘాల కమిషనర్, సబ్ రిజిస్ట్రార్ హైదరాబాద్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. మూడేళ్లు సర్వ సభ్య సమావేశం నిర్వహించని పాలక వర్గాన్ని రద్దు చేయకుండా చైర్మన్, వైస్ చైర్మన్‌లపై ఈ నెల 19న అవిశ్వాస బల నిరూపణకు డీసీఓ నోటీసులు పంపడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర సహకార సంఘాల చట్టం 1964 ప్రకారం 6 ఒకసారి సర్వసభ్య సమావేశం, మూడు నెలలకోసారి పాలకవర్గం మీటింగ్ జరగాలన్నారు. కానీ ఈ పాలక వర్గం ఒక్క సమావేశం నిర్వహించ లేదని పేర్కొన్నారు. మీటింగ్ నిర్వహించని దృష్ట్యా చట్టంలోని 32, సెక్షన్ 2 ప్రకారం పాలకవర్గాన్ని రద్దు చేయాలన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు, ప్రలోభాలకు లొంగి డీసీఓ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. సొసైటీలో రూ.కోటికి పైగా అవినీతి జరిగిందని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినా స్పందన లేదన్నారు. ఇప్పటికీ స్పందించకుంటే హైకోర్టు ద్వారా పోరాటానికి సిద్ధమైనట్లు లేఖలో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో రామ్మూర్తి, బుస్సారి లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

'భూ దందాలకు తెగబడిన ముత్తిరెడ్డి'



కురుమలను పరామర్శిస్తున్న స్వామి

తరిగొప్పుల: జిల్లాలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి భూ దందాలకు తెగబడ్డాడని, అతని అనుచరులకు భూమి దోచిపెడుతున్నాడని కురుమ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బింగి స్వామి అన్నారు. మండల పరిధిలోని సోలిపూర్ భూవివాద బాధితులను మంగళవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్ల కింద కురుమలు కొన్న భూమిని నమ్ముకుని ఉన్న వారికి అండగా ఉంటామన్నారు. దాడి చేసిన వారిని చట్టప్రకారం శిక్ష పడే వరకు పోరాటం ఆపమని హెచ్చరించారు. ధరణి పోర్టల్ భూతాన్ని సృష్టించి అమాయకమైన ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు కాసా జహంగీర్, ఎర్ర సిద్దులు, ఎగుర్ల జయరాములు, తీగుళ్ల నాగరాజు, బైర లింగం, బింగి చంద్రం, పరుశరాములు, మీసాల మల్లయ్య, కొండయ్య, ప్రశాంత్, బోగర్ల బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఐఆర్ ప్రకటించాలి

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు పెరిగిన నిత్యావసర సరుకులకు అనుగుణంగా పీఆర్‌సీ నివేదిక వచ్చేంత వరకు ఐఆర్ ప్రకటించాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ (ట్రెంగ) జిల్లా అధ్యక్షుడు కొడమల్ల రవి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 200 మంది జూనియర్ సహాయకులుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అదే విధంగా సీనియర్లు పదోన్నతి పొందేందుకు ఎదురు చూస్తున్నారని తెలిపారు. కార్యాలయంలో పని చేస్తున్న ఆఫీసు సబార్డినేటర్లను సీనియారిటీ ప్రకారం జూనియర్ సహాయకులుగా నియమించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి నాలిక ఆనంద్‌కుమార్, ఉపాధ్యక్షుడు రజాక్, సుధాకర్, ప్రియాంక, నరేందర్, రాంబాబు, సాంబయ్య, ఉమ, వంశీధర్, సందీప్, రవీందర్‌రావు, సలీం, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి దూరవిద్య పీజీ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నేటి నుంచి (12వ తేదీ) పీజీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నరేందర్ మంగళవారం తెలిపారు. పీజీ ప్రథమ సంవత్సరం పరీక్షలు ఈనెల 12, 15, 18, 20, 24 తేదీల్లో పరీక్షలు జరుగనున్నాయి. ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఈనెల 13, 17, 19, 21, 25 తేదీల్లో పరీక్షలు జరుగనున్నాయి. ప్రథమ సంవత్సరంలో 2,825, ద్వితీయ సంవత్సరంలో 2,154 మంది, మొత్తం 4,971మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు వారు తెలిపారు. యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 5, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 5, ఖమ్మం జిల్లా కేంద్రం ఒకటి మొత్తం 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. పరీక్షలు ఆయా తేదీల్లో టైం టేబుల్ ప్రకారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు జరుగుతాయన్నారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్ పాటు, ఒక అబ్జర్వర్, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. విద్యార్థులు కేయూ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. ప్రశ్న పత్రాలను ఆన్‌లైన్‌లోనే పరీక్ష కేంద్రాలకు కొద్ది సమయం ముందు పంపుతారన్నారు.

ఎల్లంబజార్‌లో చైన్‌స్నాచింగ్

రామన్నపేట: వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్లంబజార్‌లో ఓ మహిళ మెడలో నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు మూడు తులాల బంగారం గొలుసును ఎత్తుకెళ్లిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎల్లంబజార్‌కు చెందిన దీపలక్ష్మి అనే మహిళ రాత్రి సమయంలో ఇంటి ముందు వాకింగ్ చేస్తున్న విషయాన్ని గమనించిన సదరు దుండగులు ఆకస్మాత్తుగా అటువైపుగా వాహనంపై వచ్చి మెడలో నుంచి బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: మతవిద్వేశాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్న వీహెచ్‌పీ నేత కేశవ రాజ్ జీపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రంగశాయిపేట మహంకాళి దేవాలయం ప్రాంగణంలో మంగళవారం వీహెచ్‌పీ నేత కేశవరాజ్ ఇతరులతో మతవిద్వేశాలను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తూ, హిందూ మతాన్ని రక్షించాలని మాట్లాడినట్లు ఎస్సై కుమార్ ఫిర్యాదు చేశారని, ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

లాభదాయకం గొర్రెల పెంపకం

- మాంసానికి పెరుగుతున్న డిమాండ్
- జాగ్రత్తలు తీసుకుంటే సమస్యలు రావని సూచిస్తున్న శాస్త్రవేత్తలు




మామునూరు కేవీకేలో పెంచుతున్న గొర్రెలు (ఇన్‌సెట్) విత్తన పొట్టేళ్లు

పాడి-పంట

కరీమాబాద్: రోజురోజుకు మాంసానికి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో గొర్రెల పెంపకం లాభదాయకంగా మారనుంది. వ్యవసాయం చేస్తున్నట్లు, కోళ్ల ఫాంలు పెట్టినట్లుగానే గొర్రెల పెంపకం కూడా చేపట్టినట్లయితే రైతులకు ఆర్థికంగా ఎంతో ఉపయోగకరంగా మారుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గొర్రెల ఎంపిక, వసతి, పునరుత్పత్తి, ఆరోగ్య సంరక్షణ లాంటి జాగ్రత్తలు తీసుకున్నట్లయితే సమస్యలు రావని పేర్కొంటున్నారు.

పొట్టేళ్ల ఎంపిక కీలకం..

గొర్రెల పెంపకంలో పొట్టేళ్ల ఎంపిక కీలకంగా మారనుంది. గొర్రెల మంద పునరుత్పత్తిలో భాగంగా 'విత్తన' పొట్టేళ్ల పాత్ర ఎంతో ఉంటుంది. ప్రతీ ఆడ గొర్రె నుంచి సంవత్సరానికి 1 లేదా 2 కన్న ఎక్కువ పిల్లలు లభించవు. అదే విత్తన పొట్టేలుతో 50 నుంచి 75 వరకు పొందవచ్చు. అందుకే 'ఒక' విత్తన పొట్టేలు మందలో 'సగం' అంటారు. కనీసం 18 నెలల విత్తన పొట్టేలు ఎంపిక చేసుకోవాలి. వాటిని 2, 3 సంవత్సరాలకు ఒకసారి మార్చి కొత్త వాటిని తెచ్చి మందలో కలిపినట్లయితే ఆరోగ్యవంతమైన గొర్రెపిల్లలు పుడుతాయి.

వ్యాధులు.. ఆరోగ్య పరిరక్షణ

సహజంగా గొర్రెలకు వ్యాధి నిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుంది. గొర్రెల్లో ఎక్కువగా నీలి నాలుక వ్యాధి, చిట్కు రోగం, కాలి పుండ్ల వ్యాధి, బొబ్బ రోగం, గాలి కుంటు వ్యాధి తదితర వ్యాధులు వస్తుంటాయి. అవి వ్యాప్తి చెందకుండా పాకలో తేమ లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి. సాయంత్రం వేప ఆకుతో పొగ వేయాలి. ఈ క్రమంలోనే గోమారులు రాకుండా పాకల్లో సుమథియాన్, మలాథియాన్ మందులు పిచికారీ చేయాలి. అంతే కాకుండా ప్రతీ 15 రోజులకు ఒకసారి పాకలో పొడి సున్నం చల్లాలి. సంవత్సరంలో కనీసం 3 సార్లు నట్టల నివారణ మందులను తగిన మోతాదులో తాగించాలి.

గొర్రెల్లో పునరుత్పత్తి..

గొర్రెల పెంపకం దారులు విత్తన పొట్టేలును ఎక్కువ రోజులు మందలో ఉంచకూడదు. రాత్రి పూట మాత్రమే మందలో జత కలపాలి. ఈ క్రమంలోనే పునరుత్పత్తి సక్రమంగా జరగాలంటే ప్రతీ 100 ఆడ గొర్రెలకు 3 విత్తన పొట్టేళ్లను అందుబాటులో ఉంచాలి. ఆడ గొర్రెలకు మినరల్ మిక్చర్‌ను క్రమం తప్పకుండా వాడినట్లయితే ఎదకొచ్చి చూడి నిలవడానికి అవకాశం ఉంటుంది.

పాకల నిర్మాణం..

గొర్రెల పెంపకందారులు పాకల నిర్మాణంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దు. ఖర్చుకు వెనకాడకుండా వాతావరణంలో వస్తున్న మార్పులకనుగుణంగా పాకలు నిర్మించుకోవాలి. గొర్రెలు సులువుగా తిరగడమే కాకుండా విశ్రాంతి తీసుకోవడానికి అనువుగా గాలి, వెలుతురు లభించేలా చూసుకోవాలి.

జాగ్రత్తలు పాటించాలి



గొర్రెల పెంపకంపై ఆసక్తి ఉన్న వారు జాగ్రత్తలు పాటిస్తూ పెంచడం ద్వారా లాభాలు పొందవచ్చు. పిల్లల దశ నుంచి వాటి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వ్యాధులను బట్టి మందులు వాడుతూ ఉండాలి. ముఖ్యంగా పాక శుభ్రంగా ఉంచుకోవాలి. సరైన విత్తన పొట్టేలును ఎంపిక చేసుకోవాలి.

-డాక్టర్ రాజన్న, ప్రధాన శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

విద్యార్థులకు రాష్ట్రపతి ప్రశంసలు



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్రపతి


మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులను పరిశోధనల వైపు ప్రోత్సహిస్తూ సామాజిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కేంద్రం నిర్వహిస్తున్న విజ్ఞాన మేళ పోటీల్లో మానుకోట జిల్లా విద్యార్థులు పాల్గొని సత్తా చాటుతున్నారు. జాతీయ స్థాయిలో ఇన్‌స్పైర్ మేళాలో మానుకోట జిల్లా విద్యార్థులు ఎడ్ల నాని, నక్క భవానీల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఎన్‌ఐఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలను సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. తెలంగాణ నుంచి ఎంపికైన 8 ప్రదర్శనలను రాష్ట్రపతి తిలకించి ప్రత్యేకంగా విద్యార్థులతో మాట్లాడి వారు ప్రదర్శించిన ప్రదర్శనల గురించి అడిగి తెలుసుకుని అభినంధించారు. దేశవ్యాప్తంగా 60 మంది విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొనగా తెలంగాణ నుంచి 8 మంది విద్యార్థులు హాజరు కాగా, మానుకోట జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొని తమ ప్రతిభ చాటుతున్నారు. పెద్దవంగర ప్రభుత్వ పాఠశాలలో నాని 9వ తరగతి, మోడల్ స్కూల్‌లో నక్క భవాని 10వ తరగతి వరకు చదువుకుంది. భవాని ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం నేరడ మోడల్ స్కూల్‌లో పూర్తి చేసింది. కాగా అత్యంత ప్రతిభ కనబర్చిన విద్యార్థులను,గైడ్ టీచర్లను మంగళవారం కలెక్టర్ కె. శశాంక అభినందించారు.

మమ్మీ.. డాడీ ఐయామ్ సారీ..

- ఉరేసుకుని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య
- ఎంబీబీఎస్ సీటు రాదేమోనని అఘాయిత్యం



కృష్ణ(ఫైల్)



కృష్ణ రాసిన సూసైడ్ నోట్

కేసముద్రం: 'మమ్మి, డాడీ ఐయామ్ సారీ... నాకు ఎంబీబీఎస్ సీటు రాదెమోనని అనిపిస్తుంది'అని సూసైడ్ నోట్ రాసిన ఓ ఇంటర్ విద్యార్థి ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాలప్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పీక్లాతండాజీపీ శివారు బోడగుట్టతండాలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం..తండాకు చెందిన గుగులోతు లచ్చు, జ్యోతి దంపతులకు ఒక కూతురు, ఇద్దరు కుమారులున్నారు. పెద్దకుమారుడు కృష్ణ(19) ఏటూరు నాగారంలోని ట్రైబల్ వెల్ఫేర్ కాలేజీలో ఇంటర్మీడియట్(బైపీసీ) చదివి, ఇటీవల పరీక్షలు రాసి ఇంటికి వచ్చాడు. ఎంబీబీఎస్ సీటు సాధించాలనే లక్ష్యం ఉన్న కృష్ణ, ఇంట్లో గోడలపై ఎంబీబీఎస్ నా డ్రీమ్ అంటూ రాసుకున్నాడు. ఈ మేరకు నీట్ ఎంట్రన్స్ ఎగ్జామ్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. ఈక్రమంలో తల్లి పంటచేను వద్దకు వెళ్లగా, తండ్రి కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి అమ్మేందుకు వెళ్లాడు. తమ్ముడు ప్రభాకర్ పదవ తరగతి పరీక్ష రాసేందుకు కల్వల మోడల్ స్కూల్‌కి వెళ్లాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న కృష్ణ, తనకు ఎంబీబీఎస్ సీటు రాదెమోనని మనస్తాపం చెంది, ఐయామ్ సారీ మమ్మి, డాడీ అంటూ సూసైడ్ నోట్ రాసి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని తాత ఇంట్లోకి వచ్చి చూడగా ఉరివేసుకుని కనిపించాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఇంటికి చేరుకుని, కొడుకు మృతదేహంపై పడి కన్నీరుమున్నీరుగా విలపించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు ప్రజలే బలగం

- అభివృద్ధిని చూసి ఆదరించాలి
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ఉషాదయాకర్‌తో కలిసి నృత్యం చేస్తున్న దయాకర్‌రావు

పాలకుర్తి: బీఆర్‌ఎస్‌కు ప్రజలే బలగం.. కార్యకర్తలే బలమని, దేశంలో ఏ పార్టీకి లేనంత 80 లక్షల కార్యకర్తల బలగం మనదని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సోమవారం మండలంలోని వావిలాల, ముత్తారం గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం చేపట్టారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా స్థానికులు ఎద్దుల బండిపై ఊరేగింపు.. డప్పు చప్పులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి, ఎర్రబెల్లి చారిటబుల్ చైర్ పర్సన్ ఉషా దయాకర్‌రావుతో కలిసి మంత్రి దయాకర్ రావు ప్రసంగించారు. పార్టీ బలోపేతం, పటిష్టకు చేపట్టే ఆత్మీయ సమ్మేళనంలో ప్రతి ఒక్కరిని కలుపుకొని ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే పనిలో బీజేపీ ఉందని, కాంగ్రెస్ బీజేపీ వంత పాడుతుందన్నారు. నియోజకవర్గంలో ఒక్కో గ్రామ పంచాయతీలకు కోటిన్నర నుంచి రెండున్నర కోట్ల మేర ఖర్చు చేసి నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడుపుతున్నామన్నారు. బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని చూసి పార్టీని మళ్లీ ఆదరించాలని కోరారు. అనంతరం దయాకర్‌రావు దంపతులు కార్యకర్తలతో కలిసి నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జెడ్పీటీసీ పూస్కూరి శ్రీనివాస్‌రావు, మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, సర్పంచ్‌లు గంట పద్మ, కల్వాల బాస్కర్‌రెడ్డి, కత్తి సైదులు, గుగులోతు వాలు నాయక్, మహేందర్, ఎంపీటీసీలు సోమనారాయణ, నల్లపు మౌనిక, ఎఫ్ఎస్‌సీ చైర్మన్ బొబ్బల అశోక్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముస్కు రాంబాబు, పీఏసీఎస్ చైర్మన్ మైసిరెడ్డి, నాయకులు సైదులు, వెంకన్న, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళపై కత్తితో దాడి

- కేసు నమోదు



చికిత్స పొందుతున్న సునీత

దంతాలపల్లి: మహబుబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్ల గ్రామంలో మహిళపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేసిన ఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకోగా మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోలోజు కుమారస్వామి (వడ్రంగి) అదే గ్రామానికి చెందిన ఏరుకొండ ప్రవీణ్ ఇంటికి సోమవారం రేకులు వేశాడు. అదేరోజు సాయంత్రం ఏరుకొండ నరేష్ అనే వ్యక్తి సమారు 5 గంటల ప్రాంతంలో కత్తి పట్టుకొని కుమారస్వామి ఇంటికి వెళ్లి ప్రవీణ్ ఇంటికి రేకులు ఎలా వేస్తావని, నిన్ను చంపుతానని బెదిరించాడు. ఆ సమయంలో కుమారస్వామి ఇంట్లో లేకపోవడంతో అతని భార్య సునీతను విచక్షణ రహితంగా పొడిచాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు నరేష్‌ను అడ్డుకోవడానికి ప్రయత్నించగా వారికి కూడా కత్తితో బెదిరించి అక్కడి నుంచి పారిపోయాడు. గ్రామస్తుల సాయంతో సునీతను చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కుమారస్వామి కుమారుడు ఏకాంబరం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరేష్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కూచిపుడి జగదీష్ తెలిపారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



సారయ్య మృతదేహం

దుగ్గొండి: వడదెబ్బతో వ్యక్తి మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలానికి చెందిన ముప్పారపు సారయ్య(67) పక్కనే ఉన్న స్వామిరావుపల్లి గ్రామంలోని ఓ రైతుకు మిర్చి ఏరడానికి మంగళవారం కూలీ పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం పని పూర్తి కాగానే అక్కడే కాసేపు సేదదీరుదామని వేప చెట్టుకింద కూర్చున్నాడు. కాసేపటికి ఒక్కసారిగా పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పదేళ్ల క్రితం మృతి చెందగా ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడు..



వెంకటేశ్ మృతదేహం

కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన బద్ది మధునక్క, రాజయ్య కుమారుడు వెంకటేశ్ (13) అనే బాలుడు మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి సమీపంలోని చెరువు వద్ద గల చెట్టు కింద వెంకటేశ్ విఘతజీవిగా పడి ఉన్నాడు. ఇది గమనించిన పలువురు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా వెంకటేశ్ మృతి చెందినట్లు గుర్తించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే వెంకటేశ్ ఉదయం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ట్రాక్టర్‌పై వెళ్లాడని, బాలుడి తల భాగంలో గాయమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ట్రాక్టర్ పైనుంచి పడి మృతి చెంది ఉంటాడా లేక వేరే ప్రమాదం ఏమైన జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పోలీసుల అదుపులో పోకిరీలు!

- దాడిపై సర్వత్రా విమర్శలు
- కఠినంగా శిక్షించాలని స్థానికుల డిమాండ్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వినోద్

కాశిబుగ్గ: వరంగల్ 19వ డివిజన్ వివేకానందకాలనీలో ఆదివారం రాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న యువకుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన నిందితులు ఇంతేజార్‌గంజ్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. వివేకానందకాలనీకి చెందిన సిరివెల్ల వినోద్ ఓ సిటీలోని ఫంక్షన్‌కు వెళ్లి ఆదివారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ఇంటికి వెళ్తున్న క్రమంలో కాశిబుగ్గకు చెందిన ముగ్గురు పోకిరీలు బైక్‌పై అతివేగంగా పక్క నుంచే వెళ్లడంతో వినోద్ జడుసుకున్నాడు. జర చూసుకొని పోవాలంటూ వారితో అనడంతో వారు కోపోద్రిక్తు వినోద్‌ను తీవ్రంగా కొట్టడంతో కాళ్లు, చేయికి తీవ్ర గాయాలయ్యాయి. వినోద్ అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో చనిపోయినట్లు భావించి వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటన జరిగిన వెంటనే వినోద్ అన్న హరిప్రసాద్ 108 ద్వారా ఎంజీఎంకు తరలించారు. అమాయకుడైన వినోద్ రెండు కాళ్లు, కుడి చేయి విరిగేవిధంగా కొట్టడంతో కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోకిరీలను కేసు నుంచి తప్పించేందుకు అధికార పార్టీ నాయకులు ప్రయత్నించడంపై తీవ్రంగా ఖండిస్తున్నారు. పోలీసులు రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించక పోవడంతోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

కుమార్తెలకు విషమిచ్చిన తండ్రి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు

పాలకుర్తిటౌన్: భార్యపై కోపంతో ఇద్దరు కుమార్తెలకు విషమిచ్చిన తండ్రిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనలో పెద్ద కుమార్తె చికిత్స పొందుతూ మృతి చెందగా చిన్న కుమార్తె మృత్యువుతో పోరాడుతోంది. కేసు వివరాలను మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ విశ్వేశ్వర్, ఎస్సై శ్రీకాంత్‌లతో కలిసి ఏసీపీ శ్రీనివాసరావు వెల్లడించారు. పాలకుర్తి మండలంలోని గూడూరు శివారు జానకీపురానికి చెందిన గుండె శ్రీను తన భార్య ధనలక్ష్మిపై కోపంతో కుమార్తెలు నాగప్రియ(9), నందిని (5)లకు విషమిచ్చాడు. అపస్మారక స్థితికి చేరిన పిల్లలను జనగామ ఆస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించాడు. పెద్ద కుమార్తె నాగప్రియ మృతి చెందగా, రెండో కుమార్తె నందిని చికిత్స పొందుతోంది. భార్య ఫిర్యాదు మేరకు శ్రీనుపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

కూలీ హత్య కేసులో ఒకరి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ

పెద్దవంగర: వంద రూపాయల కోసం కూలీతో ఘర్షణ పడి హత్య చేసిన యజమానిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సీఐ సత్యనారాయణ, ఎస్సై పిల్లల రాజుతో కలిసి వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని గంట్లకుంట గ్రామానికి చెందిన దుర్సోజు మురళి (55) కుల వృత్తి వడ్రంగి పనులతో పాటు కూలీ పనులు చేసుకుంటూ తల్లి వద్ద ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన రైతు ముత్తినేని రాములుకు ఈ నెల 6న కూలీ పనులకు వెళ్లాడు. కూలీ డబ్బులు కోసం అదే రోజు రాత్రి 9:30 గంటలకు ఇంటికి వెళ్లి అడిగాడు. రాములు డబ్బులు ఇవ్వక పోవడంతో కూలీ పనులకు వెళ్లిన మురళి మద్యం మత్తులో రాములుకు చెందిన బస్సు డోర్ అద్దాలను ధ్వంసం చేశాడు. దీంతో ఆగ్రహానికి గురైన రాములు తన వద్ద ఉన్న కర్రతో విచక్షన రహితంగా దాడి చేశాడు. బలమైన గాయాలు కావడంతో ఈ 7న మురళి మృతి చెందాడు. తల్లి ఐలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేశారు. విచారణ అనంతరం ముత్తినేని రాములుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

కాలికి నిప్పంటించిన ఘటనలో యువకుడు..

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గట్టు మనూష్ అనే తొమ్మిదేళ్ల బాలుడి కాలికి నిప్పు పెట్టిన ఘటనలో నిందితుడు జిట్టె రాజును మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 7న కొత్తపల్లిలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గట్టు మనూష్ అనే బాలుడు ఆడుకుంటుంటే అదే గ్రామానికి చెందిన రాజు, అభినవ్‌లు వెళ్లి బాలుడి కాలికి కాటన్ కట్టి నిప్పంటించారు. దీంతో బాలుడి తండ్రి సతీష్ పోలీసులకు ఫిర్యాదు చేయడంలో రాజుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

వరంగల్‌లో టూరిజం అభివృద్ధి

- సదరన్ ట్రావెల్స్ ప్రారంభోత్సవంలో మంత్రి ఎర్రబెల్లి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి దయాకర్‌రావు, చీఫ్ విప్ వినయ్‌భాస్కర్, సదరన్ ట్రావెల్స్ ప్రతినిధులు

నయీంనగర్: వరంగల్‌లో టూరిజం, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందిందని, సదరన్ ట్రావెల్స్ సేవలు ఇక్కడ కూడా అవసరమని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మంగళవారం నయీంనగర్ పుష్పాంజలి కాంప్లెక్స్‌లో సదరన్ ట్రావెల్స్ కార్యాలయాన్ని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ టూరిజం, ట్రావెల్స్ రంగంలో సదరన్ ట్రావెల్స్‌కు మంచి పేరుందని, 50 ఏళ్లుగా ఈ సంస్థ దేశ విదేశాల్లో సేవలందిస్తుందన్నారు. యాత్రికులకు దేశ వ్యాప్తంగా మంచి ప్యాకేజీలు ఉన్నాయన్నారు. సదరన్ గ్రూప్ జేఎండీ అళపాటి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ సదరన్ గ్రూప్ కంపెనీ అత్యంత ప్రతిష్టాత్మకమైన సదరన్ గ్రాండ్ కాశీని ప్రధాని మోదీ మార్చి 28న ప్రారంభించారని తెలిపారు. వరంగల్ నూతన కార్యాలయంలో దేశీయ, అంతర్జాతీయ విహార యాత్రలు, తీర్థయాత్రలను, విమాన టికెట్లు, ప్రపంచ వ్యాప్తంగా హోటల్ రిజర్వేషన్లు, వీసా సేవలు అందిస్తుందని తెలిపారు. వచ్చే ఏడాదిలో సంస్థ మరో 50 బ్రాంచీలతో విస్తరించే ప్రక్రియలో ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎండీలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.